బాబోయ్.. బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు

● ఇటీవల అర్ధరాత్రి దూర ప్రాంతం నుంచి బస్సులో దిగి బస్టాండ్ నుంచి బయటకు వచ్చిన ఓ ప్రయాణికుడు ఆటో కోసం ఎదురు చూస్తున్నాడు. ఈ క్రమంలో ముగ్గురు గుర్తు తెలియని యువకులు పూటుగా మద్యం తాగి అతడ్ని భయపెట్టి, రూ. 2,800 లాక్కుని అక్కడ నుంచి పారిపోయారు.

● కొద్ది రోజుల కిందట రైతుబజారు వద్ద ఆకు కూరలు అమ్ముకునే మహిళ వెంటబడి.. ఆమెను ఇబ్బందులకు గురి చేశారు.

● కొద్ది రోజుల కిందట ప్రకాశం జిల్లా నుంచి వచ్చిన ఒక వ్యక్తిని, ఓ మహిళ కొంత మంది వ్యక్తులతో కలసి మాయ చేసింది. అతడ్ని కాకాని రోడ్డులోకి తీసుకెళ్లి కొట్టి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిపోయారు.

● ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక వృద్ధుడిని బ్లేడ్ బ్యాచ్ గొంతు కోసి, అతని వద్ద డబ్బులు లాక్కుని వెళ్లిపోయిన సంఘటన కలకలం రేపింది.

● బస్టాండ్‌లో ఆటో ఎక్కిన మహిళను ఆటో నగర్ వద్ద ఎక్కిన వ్యక్తులు ఆమెను భయపెట్టి పర్సు, సెల్‌ఫోన్ లాక్కుని వెళ్లిన ఘటనలో నిందితుల్ని గతంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఇటువంటి ఘటనలు నగరంలో పెరిపోతున్న పరిస్థితులు కనపడుతుండటంతో నగర ప్రజలు భీతిల్లుతున్నారు.

● ఆర్టీసీ బస్టాండ్ వద్ద పలు ఘటనలు
● అర్ధరాత్రి పూట దాడులు
● భీతిల్లుతున్న నగర ప్రజలు

పట్నంబజారు: నగరంలో బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు పెరిగిపోతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నారని తెలుస్తోంది. మద్యం, గంజాయికి అలవాటు పడిన యువకులు ఒక గ్రూపుగా ఏర్పడి.. ఓల్డ్‌క్లబ్ రోడ్డులోని ఒక బార్ వద్ద, బస్టాండ్ ఎదురుగా వైన్స్‌ల వద్ద కాపలా కాస్తారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారిని గుర్తించి, నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకుని వెళ్లి భయపెట్టి డబ్బులు గుంజుకుంటున్నారు.

బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ కాంప్లెక్స్‌ను అడ్డాగా చేసుకుని, నిత్యం మద్యం తాగడం బ్లేడ్ బ్యాచ్‌కు పరిపాటిగా మారింది. కొత్తపేట, పాత గుంటూరు పోలీసుస్టేషన్ల పరిధిలోనే వీరు అధికంగా ఉంటున్నారని తెలుస్తోంది. సాయంత్రం 7గంటల నుంచి గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారిని భయపెట్టడం.. డబ్బులు లాక్కోవడం నిత్యకృత్యంగా మారిపోయింది. కేవలం మద్యం, గంజాయికి బానిసలుగా మారి ఇటువంటి ఆగడాలకు పాల్పడుతున్నారని తెలుస్తోంది.

ఓవర్ బ్రిడ్జిల కింద కూడా దాడులు

నగరంలోని అరండల్‌పేట, మణిపురం, కంకరగుంట ఓవర్ బ్రిడ్జిల వద్ద సైతం బ్లేడు బ్యాచ్‌లు తిరుగుతున్నాయి. గతంలో అరండల్‌పేట ఓవర్ బ్రిడ్జి కింద ఒక వ్యక్తిపై బ్లేడు బ్యాచ్ దాడి చేసి.. డబ్బులు లాక్కుని పరారైన సంఘటన ఉంది. అయితే, గతంలో జిల్లా ఉన్నతాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించి నిలువరించిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడు మరలా హల్‌చల్ సృష్టిస్తున్నారని, ఆర్టీసీ బస్టాండ్ వద్ద వ్యాపారులు చెబుతున్నారు.



మాయ చేసి.. చావకొట్టి దోపిడీ

ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా కొత్తపేట పోలీసుస్టేషన్ పరిధిలో కొంత మంది వ్యభిచారులు నేరుగా రోడ్లపైనే ఉంటున్న దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల వ్యక్తులు, కార్మికుల్ని టార్గెట్ చేసి వల వేస్తారు. ముందుగానే ఆటోలో వారి వ్యక్తుల్ని సెట్ చేసుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకుని వెళ్లి, చావకొట్టి డబ్బులు లాక్కుంటున్నారు. ఇటువంటి విషయాల్లో కేసులు పెడితే తమ పరువు పోతుందని భావించిన వ్యక్తులు ఒకరిద్దరూ తప్పా స్టేషన్లకు వచ్చి ఫిర్యాదు చేసిన పరిస్థితులు లేకుండా పోయాయి.

అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు

బస్టాండ్ ఎదురుగా బార్ అండ్ రెస్టారెంట్లు పుట్టగొడుగుల్లా ఉన్నాయి. అర్ధరాత్రి రెండు గంటల వరకు కూడా మద్యం అమ్ముతున్న పరిస్థితులు ఉండటంతో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయి. బ్లేడ్ బ్యాచ్‌లు పూటుగా మద్యం తాగి ఆగడాలు చేస్తున్నాయి. కొత్తపేట పీఎస్ పోలీసులకు స్పష్టంగా బార్లు తెరిచి ఉంటున్నాయని తెలిసిననప్పటికీ కనీసం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా బ్లేడ్ బ్యాచ్ ఆగడాలపై పోలీసు జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

బ్లేడ్ బ్యాచ్ ఆగడాలపై చర్యలు తీసుకుంటాం. అయితే ఇప్పటి వరకు ఫిర్యాదుదారులు రాలేదు. రాత్రి వేళల్లో బార్‌లు కూడా నిబంధనలకు అనుగుణంగా మూయిస్తున్నాం. ఇప్పటికే సిబ్బందితో సాయంత్రం, రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. ఎటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

– కొత్తపేట, పాత గుంటూరు పీఎస్ ఎస్‌హెచ్‌వోలు షేక్ అన్వర్ బాషా, ఎం.వి. సుబ్బారావు

లక్ష్మీపురం ప్రధాన రహదారికి మహర్దశ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరి, మేయర్ కావటి తదితరులు

పట్నంబజారు: నగరంలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన లక్ష్మీపురం ప్రధాన రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహనాయుడు శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో రహదారి కూడా 80 అడుగుల బీటీగా రూపు దిద్దుకోనుంది. నగరంలోని 32, 33 డివిజన్ పరిధిలోకి వచ్చే రహదారి నిర్మాణ పనుల్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ పాలనలో గుంటూరు అంతా గుంతల మయంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని చెప్పారు. దానిలో భాగంగానే లక్ష్మీపురం మదర్‌థెరిస్సా విగ్రహం నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ప్రధాన రహదారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ తన నియోజకవర్గమైన గుంటూరు పశ్చిమ ప్రగతిపథంలో పరుగులు పెడుతున్నట్లు చెప్పారు. ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఎక్కడ ప్రజలకు చిన్న ఇబ్బంది తలెత్తినా తక్షణమే స్పందించి సంబంధిత అధికారుల్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. తాజాగా మొదలైన అభివృద్ధి పనులతో లక్ష్మీపురం ప్రధాన రహదారి దశదిశ మారబోతున్నట్లు చెప్పారు. మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ గుంటూరులో లక్ష్మీపురం ఎంతో ముఖ్యమైన ప్రాంతమని, అనేక ప్రముఖ వ్యాపార సముదాయాలు ఉన్న ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన పాలకవర్గం ఏర్పడ్డాక గుంటూరు నగరంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ , గుంటూరు అర్బన్ బ్యాంకు డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, కార్పొరేటర్ గోపీ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి, కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



ఎన్‌సీసీ కేడెట్లతో జూపూడి రంగరాజు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్‌సీసీ బీ, సీ సర్టిఫికెట్ ఫలితాల్లో హిందూ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం తెలిపారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 25 ఆంధ్ర ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ఫిబ్రవరిలో నిర్వహించిన బీ సర్టిఫికెట్ పరీక్షా ఫలితాల్లో 17 మంది, సీ సర్టిఫికెట్ పరీక్షా ఫలితాల్లో తొమ్మిది మంది ఉత్తీర్ణులైనట్లు వివరించారు. విద్యార్థుల్ని కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు అభినందించారు. విద్యార్థులకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, హవల్దార్ కె. గంగాధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ సీహెచ్. అజిత్‌బాబు పాల్గొన్నారు.

సీఎం వై.ఎస్. జగన్ మహిళల పక్షపాతి



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళా నేతలు

పట్నంబజారు: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని మహిళాలోకం చాటి చెప్పింది. ఆసియాలోనే అతి పెద్దదైన మార్కెట్ యార్డు కమిటీలో మహిళలకు ప్రాధాన్యత కల్పించడంపై హర్షం వ్యక్తం చేసింది. వైఎస్సార్ సీపీ మహిళా నేతలు శుక్రవారం బ్రాడీపేటలో సీఎం వై.ఎస్.జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళా విభాగం నగర అధ్యక్షురాలు గనిక ఝాన్సీరాణి, మార్కెట్ యార్డు డైరెక్టర్ కొప్పుల విజయమాధవి మాట్లాడుతూ సీఎం జగన్ మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తూ, పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అన్ని అంశాల్లో అగ్రతాంబూలం ఇస్తూ, వారికి సోదరుడిగా తానున్నాననే భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీలోనూ తొలి నుంచి కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం దక్కుతోందని వివరించారు. అనంతరం మిర్చి యార్డు డైరెక్టర్‌గా నియమితులైన కొప్పుల విజయమాధవిని శాలువాతో సత్కరించి, చీర బహూకరించారు. కార్యక్రమంలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నేతలు ఈపూరి వనజాక్షి, మల్లెల సత్యవతి, రత్నకుమారి, ఖైరూన్, శిరీష, అనూష, శ్రావణి, షేక్ జిలాని పాల్గొన్నారు.

‘డైట్’లో నాణ్యమైన భోజనం అందించకపోతే చర్యలు

సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్



ఆసుపత్రిలో గోడలపై స్టిక్కర్లు తొలగిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ డైట్ క్యాంటీన్‌లో వైద్యులకు సరిపడా భోజనం వండించాలని, లోపల అపరిశుభ్ర వాతావరణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించనని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ స్పష్టం చేశారు. ఆసుపత్రిలోని డైట్ క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. వైద్యులకు సరిపడా ఆహారం అందించడం లేదని, డ్యూటీ వైద్యులు సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. పీజీ వైద్య విద్యార్థులు సైతం డైట్ క్యాంటీన్‌పై ఫిర్యాదు చేశారు. డ్యూటీ డాక్టర్లకు తప్పనిసరిగా నాణ్యమైన భోజనం అందించాలని ఆయన నిర్వాహకులకు స్పష్టం చేశారు. మెను ప్రకారం వైద్యులకు భోజనం అందించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఆసుపత్రి గోడలపై స్టిక్కర్లు అంటిస్తే సహించం

జీజీహెచ్ క్యాజువాల్టీ గోడలపై స్టిక్కర్లు అంటించడంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తనిఖీల్లో గోడలపై స్టిక్కర్లు తొలగించాలని ఆదేశించినా శానిటేషన్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో కోపగించుకున్నారు. స్వయంగా కొన్నింటిని తొలగించారు. ఆసుపత్రిలో అపరిశుభ్రమైన వాతావరణం కనిపిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి పాటుపడాలి: మేయర్



మేయర్ కావటిని సన్మానిస్తున్న మార్కెట్ యార్డు డైరెక్టర్లు

నెహ్రూనగర్: వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి, రైతులకు మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు సూచించారు. గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ నూతన పాలకమండలికి డైరెక్టర్స్‌గాఎంపికైన పాతకుంటి సుశీల, బొందలపాటి వెంకటేశ్వరరావు, గుడివాడ అరుణ శుక్రవారం నగర మేయర్‌ను సంపత్ నగర్‌లోనిక్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, బొకేతో ఆయన్ను సత్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా వ్యవహరించాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, వెంకటరెడ్డి, బాలవెంకటరెడ్డి, బొందలపాటి భాస్కరరావు, భాస్కర్, గ్రంధి హనుమంతరావు, రఘు పాల్గొన్నారు.

నిరంతర వర్షాలతో అప్రమత్తత అవసరం

అధికారులకు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. వర్షా కాలంలో తీసుకోవాల్సిన చర్యలపై శుక్రవారం ఆమె టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ శాఖ సూచనల మేరకు మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నేపథ్యంలో అధికారులు, నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ప్రజారోగ్య, ఇంజినీరింగ్ అధికారులు సంబంధిత సచివాలయం కార్యదర్శులతో తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యల్ని గుర్తించాలని చెప్పారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని ఆదేశించారు. గాలుల వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడినా, తాగునీటి సరఫరాకి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా పంపింగ్ కేంద్రాల్లో జనరేటర్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సంబంధిత ఏఈ, డీఈఈలు నేరుగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. రోడ్ల మీద ఎక్కడైనా చెట్లు పడితే వాటిని వెంటనే తొలగించడానికి పార్క్ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. శిథిలావస్థ భవనాల్లో నివాసం ఉండే వారిని అప్రమత్తం చేస్తూ, వారి రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సచివాలయ కార్యదర్శుల్ని ఆదేశించారు. నగర ప్రజలకు ఎక్కడైనా సమస్యలు ఎదురైతే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103 నంబర్‌కి కాల్ చేయవచ్చని ఆమె సూచించారు.

భార్యాభర్తల వివాదంలో పరస్పర ఫిర్యాదులు

గుంటూరు ఈస్ట్: భార్యాభర్తల వివాదంలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వి.ఆషా భర్త ఏసుబాబుతో గొడవ పడి కోర్టులో కేసు వేసింది. ఈ నేపథ్యంలో భర్త ఏసుబాబుతో పాటు అతని తల్లిదండ్రులు, ఆడపడుచులు కొట్టి, ఇంట్లోంచి బయటకు గెంటివేశారంటూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆషాతో పాటు ఆమె తల్లిదండ్రులు, సోదరుడు ఏసుబాబు ఇంట్లోకి ప్రవేశించి సామాన్లు ధ్వంసం చేశారంటూ ఏసుబాబు, సోదరి కృపారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులపై కేసు నమోదు చేశారు.

ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌కు చెందిన రామకోటి, అతని భార్య మార్తమ్మ, కొండలు అనే ముగ్గురు గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో వార్డు బోయ్ ఉద్యోగం ఇప్పిస్తామని లక్ష్మీనగర్‌కు చెందిన దూదేకుల నాసరయ్య, వెంకటకృష్ణ, వెంకటేశ్వరరెడ్డిని నమ్మించారు. ముగ్గురు కలిసి రూ. 6.50 లక్షలు చెల్లించారు. ఉద్యోగం ఇవ్వకపోగా బాధితుల్ని రామకోటి, కొండలు బెదిరించారు. ఈ మేరకు బాధితులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం

వివాహిత అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదుచేశారు. రామిరెడ్డినగర్‌లో నివాసం ఉండే వివాహిత ఈనెల 19న ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తిపై దాడి

వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బ్రాడీపేట 4వ లైనులోని అంబికా మొబైల్ యాక్సెసరీస్ షాపులో గుమస్తాగా షైలేష్ కుమార్ పని చేస్తున్నాడు. సుభాని వచ్చి చార్జింగ్ కనెక్టర్ అడగ్గా ఇచ్చేందుకు నిరాకరించి, షాపు యజమాని ఉన్న సమయంలో రావాలన్నాడు. దీంతో షైలేష్ కుమార్‌పై సుభాని దాడిచేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

బాలిక అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. నెహ్రూనగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 15 సంవత్సరాల బాలిక బేల్దారి పనుల నిమిత్తం గురువారం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఆచూకీ కోసం వెతికి ఫలితం లేకపోవడంతో కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని తల్లిదండ్రులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో అన్ని స్థానాల్లో పోటీ

ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ టి.సేవకుమార్

గుంటూరు మెడికల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏపీలో ఉన్న 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆమ్ ఆద్మీ పార్టీ పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తాతా సేవకుమార్ శుక్రవారం తెలిపారు. అన్ని జిల్లాల్లో పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జిలను నియమించామని చెప్పారు. త్వరలో పార్టీని బూత్ స్థాయికి, ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్తామని పేర్కొన్నారు. ప్రజలతో కలిసిమెలిసి ఉంటూ, ప్రజాసేవ చేసేవారికి పార్టీలో ప్రాధాన్యత ఉంటుందని ఆయన తెలిపారు. త్వరలో ఆప్ మేనిఫెస్టోను విడుదల చేస్తామని వెల్లడించారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి యువత, మహిళలు, స్థానికులు ముందుకు రావాలని ఆయన కోరారు. ఆసక్తి ఉన్నవారు 9848391212 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

జగనన్న గోరుముద్ద నాణ్యత పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: మణిపురంలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను శుక్రవారం గుంటూరు డీవైఈవో పి.వెంకటేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా జగనన్న గోరుముద్ద ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి, విద్యార్థులకు స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా కేటాయింపులు చేస్తున్న దృష్ట్యా, విద్యార్థులకు పరిశుభ్రమైన, బలవర్థకమైన ఆహార పదార్థాల్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం జిలానీ బాషా, ఉపాధ్యాయులు ఉన్నారు.

భావి ఉపాధ్యాయులుగా రాణించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు ఉత్తమ క్రమశిక్షణతో భావి ఉపాధ్యాయులుగా రాణించాలని ఆర్వీఆర్ బీఈడీ కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కళాశాలలో శుక్రవారం 2022–24 బ్యాచ్ విద్యార్థులకు ఇండక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంగయ్య మాట్లాడుతూ సమాజంలో విద్యకు ప్రాముఖ్యత ఎంతో ఉన్నతమైనదని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా భావి ఉపాధ్యాయులుగా ఎదిగే బీఈడీ విద్యార్థులు బోధన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య మోటూరి రవికుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి



నెహ్రూనగర్: మణిపూర్‌లో అరాచకాల్ని అరికట్టి అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మణిపూర్‌లో విధ్వంసానికి వ్యతిరేకంగా లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో ఎంతోకాలంగా దాడులు జరుగుతుంటే అక్కడ మీడియాని, పోలీసుల్ని కట్టడి చేసి గోప్యంగా ఉంచడం బీజేపీ నిరంకుశత్వానికి నిదర్శనమని తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపి దోషుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది వైకే, జి. ఆర్. భగత్ సింగ్, జూపూడి శ్రీనివాసరావు, గంటా ప్రభుదాస్, సాంబశివరావు, సాంబయ్య, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

రెప్కో బ్యాంక్‌లో డిపాజిట్ క్యాంప్ ప్రారంభం



నగరంపాలెం: రెప్కో బ్యాంక్ (భారత ప్రభుత్వ సంస్థ) గుంటూరు శాఖలో ఈనెల 21 నుంచి ఆగస్టు 31 వరకు డిపాజిట్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు బ్రాంచి చీఫ్ మేనేజర్ ఎ.లక్ష్మీబాయ్ పేర్కొన్నారు. నగరంలోని బ్యాంక్ కార్యాలయంలో శుక్రవారం డిపాజిట్ క్యాంప్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్యాంప్‌లో ‘రెప్కో– 400’ అనే నూతన డిపాజిట్ పథకం ద్వారా 400 రోజులకు సాధారణ డిపాజిటర్లకు 7.75 శాతం , సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థిరాస్తిపై కూడా తనఖా రుణాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0863–2331775, 9490754934 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వేధిస్తున్న భర్తపై కేసు

గుండవరం(చేబ్రోలు): అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదయ్యింది. పోలీసులు వివరాల మేరకు.. మండల పరిధిలోని గుండవరం గ్రామానికి చెందిన నల్లప్రోతు అనూషకు ఎనిమిదేళ్ల క్రితం గుంటూరుకు చెందిన రవితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యసనాలకు అలవాటుపడిన రవి అదనపు కట్నం కోసం వేధిస్తున్నట్లు భార్య అనూష ఫిర్యాదులో పేర్కొంది. చేబ్రోలు ఎస్‌ఐ జి.వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం, బాపు – రమణ – బాలు కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ హాలులో ఆదివారం ‘కవి మిత్రుల సంగమం–కవి సమ్మేళనం’ నిర్వహిస్తున్నట్లు సంఘం స్టేట్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రంగిశెట్టి రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో డాక్టర్ రమణ యశస్వి రచించిన ‘మా గణపవరం కథలు’ పుస్తక సమీక్ష ఉంటుందని పేర్కొన్నారు. సమ్మేళనంలో కవులంతా పాల్గొని కవితల్ని వినిపించాలని ఆయన కోరారు.

శరవేగంగా డ్రెయినేజీ నిర్మాణ పనులు



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: గత ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న డ్రెయినేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని పదో డివిజన్‌లోని జున్ను సైదా నగర్‌లో శుక్రవారం రాత్రి ఆయన డ్రెయినేజీ పనుల్ని పరిశీలించారు. పనుల్లో భాగంగా దెబ్బతిన్న ఇళ్లు, మరుగుదొడ్లు తిరిగి నిర్మిస్తామని చెప్పిన మున్సిపల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. గత ప్రభుత్వాలు అభివృద్ధిని అటకెక్కించాయని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, కార్పొరేషన్ అధికారులు, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగికి డీఆర్‌ఎం సాయం



లక్ష్మీపురం: నరసరావుపేటలో గత మూడు రోజులుగా రైల్వే లైను పనులు చేస్తున్న ట్రాక్‌మెన్ ట్రైనర్ కమలేష్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తక్షణమే స్పందించారు. వెంటనే వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రత్యేక చొరవతో చికిత్సకు రూ. 5 లక్షలు మంజూరు చేయించారు. చికిత్స అనంతరం కోలుకున్న కమలేష్, డివిజన్ రైల్వే సిబ్బంది డీఆర్‌ఎం చేసిన సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు. రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్‌కు నూతనంగా ఎన్నికైన సెక్రటరీ రాఘవబాబు, ఆదినారాయణరెడ్డి, పలువురు సభ్యులు డీఆర్‌ఎం రామకృష్ణను శుక్రవారం సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైల్వే పెన్షనర్స్ నూతన కార్యవర్గ అసోసియేషన్ సభ్యులు కోటేశ్వరరావు, నారాయణరెడ్డి, సుధాకరరావు, శివరామ్, రమేష్, బాబూరావు పాల్గొన్నారు.